క్లుప్తంగా

ముసుగు తొలగింది



హొళగుందలో వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొలగించిన దృశ్యం

హొళగుంద: మండల కేంద్రంలో ఎట్టకేలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వేసిన ముసుగును అధికారులు సోమవారం తొలగించారు. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా కోడ్ అమలులో ఉన్నందున అధికారులు వైఎస్సార్ విగ్రహానికి ముసుగు వేశారు. అయితే ఎన్నికలు ముగిసి కోడ్ ఎత్తివేసినా ముసుగు తొలగించలేదు. దీనిపై సోమవారం సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితం కావడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించి ముసుగు తొలగించారు.

నాడు-నేడుతో బడులకు మహర్దశ



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

మద్దికెర: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని సర్పంచ్ కారుమంచి మల్లికార్జున అన్నారు. సోమవారం పెరవలి గ్రామంలోని శిలారాం కోటలో ఉన్న ఎంపీపీ పాఠశాలలో రూ.13 లక్షలతో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడేవారన్నారు. ప్రస్తుతం విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఉపసర్పంచ్ ఆముదాల గోపాల్, నాయకులు రామలింగారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఎంజీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు ప్రశాంతంగా జరుపుకోండి

గోనెగండ్ల: గంజిహళ్లి గ్రామంలో మంగళవారం జరిగే సద్గురు బడేసాహెబ్ తాత నెల ఉరుసు మహోత్సవాలను భక్తులు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ పి.తిమ్మారెడ్డి సూచించారు.సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఉరుసు మహోత్సవంలో మద్యం సేవించి అల్లర్లు చేయరాదని సూచించారు.అలాగే ఎద్దుల బండలాగుడు పోటీలు, సాయంత్రం భజన పోటీలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు ఆస్పరికి మంత్రి రాక

ఆస్పరి: పొదుపు మహిళలకు మూడవ విడత వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేసేందుకు మంగళవారం కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆస్పరికి వస్తున్నట్లు ఏపీఎం రాఘవేంద్ర తెలిపారు.సోమవారం వైకేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 386 స్వయం సహాయక సంఘాలలోని 3,946 మంది సభ్యురాళ్లకు రూ.1.58 కోట్ల మెగా చెక్కును మంత్రి పంపిణీ చేస్తారని చెప్పారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పొదుపు సంఘం మహిళలు హాజరు కావాలని కోరారు.

29న మార్కెట్ వేలంపాట

మద్దికెర: మేజర్ పంచాయతీ మద్దికెర పరిధిలో 2023–24 సంవత్సరానికి ఏడాది పాటు (దినసరి, నెలసరి, వారం చొప్పున) బస్టాండు తదితర మార్కెట్లలో సుంకం వసూలు చేసుకునే హక్కులకు సంబంధించి ఈ నెల 29వ తేదీన స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11:30 గంటలకు సర్పంచ్ సుహాసిని అధ్యక్షతన వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి తెలిపారు. ఆసక్తి గలవారు రూ.30 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీ



కూల్‌డ్రింక్ షాపులో తనిఖీ చేస్తున్న దృశ్యం

పత్తికొండ రూరల్: పత్తికొండ పబ్లిక్ రీడింగ్ రూం షాపింగ్ కాంప్లెక్స్‌లోని గౌస్ కూల్‌డ్రింక్ షాపులో సోమవారం అసిస్టెంట్ ఫుడ్‌సేఫ్టీ కంట్రోలర్ కూర్మానాయక్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఆదివారం పత్తికొండ సీఐ మురళీమోహన్ ఆ షాప్‌లో కూల్‌డ్రింక్ తాగగా బాటిల్‌పై గడువు తేదీ ముగిసి ఉండడం గమనించారు. అనుమానం వచ్చి షాపులోని కూల్‌డ్రింక్స్‌ను పరిశీలించగా అన్నీ కాలం చెల్లినవే ఉండడం గుర్తించి ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు సోమవారం తనిఖీ చేపట్టారు. కూల్‌డ్రింక్స్ బాటిళ్లపై ఉన్న గడువు తేదీని పెన్నుతో చెరిపేసి, బ్లేడుతో తొలగించి మరీ విక్రయాలు చేపట్టినట్లు విచారణలో బయటపడింది. ఉద్దేశపూర్వకంగానే షాపు యజమాని గౌలిసుబాన్ కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్‌ను ప్రజలకు విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. పూర్తి నివేదికను కర్నూలు కోర్టుకు సమర్పిస్తామని ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు.

నిబంధనలకు నీళ్లు

- మినరల్ పేరుతో జనరల్ నీరు సరఫరా
- నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్ల యజమానులు
- ఒక్క క్యాన్ నీళ్లు రూ.15 నుంచి రూ.20 వరకు విక్రయం
- శుద్ధి చేయని నీరు తాగడం మంచిది కాదంటున్న వైద్యులు
- చోద్యం చూస్తున్న అధికారులు



వాటర్ క్యాన్లను తరలిస్తున్న ఆటో

ఆలూరు రూరల్: వాటర్ ప్లాంట్ల వ్యాపారులు ప్రజల ఆరోగ్యం కంటే వారి లాభాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రస్తుతం పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సామాన్య ప్రజలు సైతం మినరల్ వాటర్‌ను తాగుతున్నారు. దీంతో పాటూ వేసవి దృష్ట్యా తాగునీటి కొరత ఉండడంతో ఆర్వో ప్లాంట్ (రివర్స్ ఓస్మోసిస్) నిర్వాహకులు ఇష్టానుసారంగా నీరు సరఫరా చేసి డబ్బులు దండుకుంటున్నారు. ప్రత్యేకంగా ఆలూరు నియోజకర్గంలో మినరల్ వాటర్ పేరుతో అందినకాడికి దోచుకుంటున్నారు. ప్రజలకు మినరల్ వాటర్ అలవాటు పడటంతో మోసం చేయడం వ్యాపారులకు వరమైంది. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 17 ప్రైవేటు ఆర్వో ప్లాంట్లు ఉన్నాయి. వీటి నిర్వాహకులు నీటిని నామమాత్రంగా శుద్ధిచేసి ప్రజలకు సరఫరా చేస్తూ వారి ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ప్రస్తుతం నడుస్తున్న వాటర్ ప్లాంట్లకు పంచాయతీ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేవు. జనరల్ నీటినే క్యాన్లలో నింపుతూ రూ.15 నుంచి రూ.20 వరకు వసూళ్లు చేసుకుని జేబులు నింపుకుంటున్నారు. వాటర్ ప్యాకెట్లపై ఎలాంటి ఐఎస్ఐ ముద్రలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా తమ సొంత బ్రాండ్ పేర్లతో ప్లాస్టిక్ కవర్లలో నీటిని నింపి వంద ప్యాకెట్లు గల సంచిని రూ.70కు దుకాణాలకు విక్రయిస్తున్నారు. దుకాణదారులు వాటిని కూలింగ్ చేసి వినియోగదారులకు ఒక్క ప్యాకెట్ రూ.2 లకు అమ్ముతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

ఆర్వో ప్లాంట్ (రివర్స్ ఓస్మోసిస్) ఏర్పాటు చేయాలంటే సంబంధిత గ్రామ పంచాయతీ నుంచి అనుమతితో పాటు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. ఆర్వోకు అనుమతి ఇచ్చిన వివరాలు సంబంధిత గ్రామీణ నీటి సరఫరా అధికారులకు పంపిస్తారు. మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ నిపుణులు పరీక్షలు చేసిన తరువాత ప్రజలకు నీటి సరఫరా చేసేందుకు అనుమతి లభిస్తుంది. నీటి సరఫరా డబ్బాలను రోజూ శుభ్రం చేయాలి. నీటిలో లవణాలు, ఖనిజాలు, క్యాల్షియం, నైట్రేట్స్, పీహెచ్ శాతం 6.5 నుంచి 8.5 శాతం ఉన్నాయో లేదో పరీక్షించిన తరువాత నీటిని విక్రయించాల్సి ఉంటుంది. ప్రస్తుతం 90 శాతం మేరకు నీటి శుద్ధి కేంద్రాలు కనీస ప్రమాణాలను పాటించడం లేదు. శుద్ధి చేయని నీటిని ఆటోల ద్వారా ఇంటింటికీ వెళ్లి సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి పొంది గ్రామ పంచాయతీల నిర్వహణలో ఉన్న 6 వాటర్ ప్లాంట్లు, తాగునీటి బోర్లు, ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ల నుంచి మాత్రమే ప్రతి నెలా శ్యాంపిల్స్ సేకరించి ల్యాబ్‌లో చెక్ చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు ప్రైవేటు ఆర్వోకు అనుమతి ఇచ్చి ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు ప్లాంట్ వివరాలు పంపితేనే నీటి శుద్ధ పరీక్షలు చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వెల్లడిస్తున్నారు.

శుద్ధిచేయని నీరు తాగడం మంచిది కాదు



శుద్ధిచేయని నీరు తాగడం వల్ల అనారోగ్యం బారిన పడతారు. ఆర్వో (రివర్స్ ఓస్మోసిస్) ప్రక్రియ చేయని నీటిని తాగడం వల్ల వ్యాధులు సంక్రమిస్తాయి. ఆర్వో ప్లాంట్లలో లభ్యమయ్యే తాగునీటిలో తగిన మినరల్స్ ఉండేలా చూసుకోవాలి. కనిపించడానికి తెల్లగా ఉన్నాయని తాగే నీటి వల్ల నష్టం వాటిల్లుతుంది. ఈ నీరు తాగడంతో పళ్లకు గారపట్టడంతో పాటు కీళ్ల నొప్పులు, గ్యాస్ట్రబుల్ వంటి వ్యాధులు సంభవిస్తాయి.

– లక్ష్మినారాయణ, డాక్టర్, ఆలూరు

నోటీసులు జారీ చేస్తున్నాం



గ్రామ పంచాయతీ అనుమతులు పొందకుండా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం విరుద్ధం. మండలంలో అనధికారంగా నడుపుతున్న ఆర్వో ప్లాంట్ యజమానులకు నోటీసులు జారీ చేశాం. శుద్ధి చేసిన నీటినే సరఫరా చేయాలని సూచిస్తున్నాం. నిబంధనలు పాటించని ప్లాంట్లను సీజ్ చేసి చర్యలు తీసుకుంటాం.

– ప్రకాష్ నాయుడు, ఈఓపీఆర్డీ, ఆలూరు

31న గిరక ఎద్దుల బండి పోటీలు

ఆస్పరి: మండలంలోని తురువగల్లు గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 31వ తేదీన రాష్ట్రస్థాయి గిరక ఎద్దుల బండి పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పోటీల్లో విజేతకు రూ.20.016 నగదు బహుమతి, తరువాతి స్థానాలకు వరుసగా రూ.15,016,రూ.10,016, రూ.8,016, రూ.6,016, రూ.5,016, రూ.4,016, రూ.3,016, రూ.2,216, రూ.2,016, రూ.1,516 చొప్పున అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వృషభాల యజమానులు ఎంట్రీ ఫీజు రూ.600 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని వివరాలకు సెల్ 87906 92241, 96184 49870 నంబర్లను సంప్రదించాలన్నారు.

పన్ను వసూళ్లపై నిర్లక్ష్యం వద్దు

హొళగుంద: హొళగుంద మేజర్ గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం, పన్ను వసూళ్లపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ హెచ్చరించారు. సోమవారం ఆయన గ్రామంలో జరుగుతున్న చెత్త సేకరణ, పన్నుల వసూలు తదితర వాటిని పరిశీలించారు. గ్రామంలో తాగునీరు, డ్రైనేజీలు శుభ్రం ఇతర అన్నింటిపై దృష్టి పెట్టి ప్రజలు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఈ నెలాఖరుకల్లా పన్నుల వసూళ్లు, ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించాలని తద్వారా వచ్చే నిధులను అభివృద్ధి పనులకు వాడుకునేందుకు ఆస్కారముంటుందని చెప్పారు.

పరీక్ష కిట్లు పంపిణీ

నందవరం: పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతుండటంతో వారికి అవసరమయ్యే పరీక్ష సామగ్రిని వాల్మీకి సంఘం పెద్దలు పంపిణీ చేశారు. సోమవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 215 మంది పదో తరగతి విద్యార్థులకు నందవరం వాల్మీకి సంఘం పెద్దలు లింగమూర్తి, రామాంజనేయులు, వీరేష్, గజేంద్ర, విశ్వనాథ్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ శైలజ, హెచ్ఎం అరుణ చేతుల మీదుగా ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు భయం వీడి ధైర్యంగా పరీక్షలు రాయాలన్నారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

హొళగుంద: విద్యార్థులు కష్టపడి గాకుండా ఇష్టంతో చదవాలని, భయం, ఒత్తిడికి లోనుకాకుండా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తే మంచి ఫలితం ఉంటుందని ఎస్ఎఫ్ఐ జిల్లా, మండల కమిటీ నాయకులు మల్లికార్జున, పరమేశ్ సూచించారు. వారు సోమవారం ఇంగళదహాళ్ జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. హెచ్ఎం శ్రీనివాసులు, టీచర్లు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో అడ్మిషన్లు

మద్దికెర/ఆస్పరి: కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో 6వ తరగతి, ఇంటర్మీడియెట్ ఎంపీసీ గ్రూపులో ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థులు ఏప్రిల్ 20వతేదీ లోపు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని మద్దికెర, ఆస్పరి కస్తూర్బా పాఠశాలల ప్రిన్సిపాళ్లు అబిదాబేగం, విజయలక్ష్మి తెలిపారు. వారు సోమవారం వేర్వేరుగా మాట్లాడుతూ మద్దికెర కస్తూర్బాలో ఇంటర్ ఎంపీసీ గ్రూపులో 40 సీట్లు, 6వ తరగతిలో 40 సీట్లు ఉన్నాయన్నారు. పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ బాలికలు మాత్రమే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆస్పరి కస్తూర్బాలో ఇంటర్‌లో 40 సీట్లు, 6వ తరగతిలో 40 సీట్లు, 7వ తరగతిలో 5 సీట్లు, 9వ తరగతిలో 9 సీట్లు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు

చిప్పగిరి: స్థానిక కేజీబీవీలో 6, 7, 8, 9 తరగతులతో పాటు ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు అర్హులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఓ షబానా సూచించారు. ఆన్‌లైన్‌లో apkgbv.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు.

ఈఓపై ఆరోపణలు అవాస్తవం



బహిరంగ విచారణ చేస్తున్న ఈఓపీఆర్డీ ప్రకాష్ నాయుడు

ఆలూరు రూరల్: ఆలూరు గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఈఓ కృష్ణకుమార్ సహకరించడం లేదంటూ టీడీపీ మద్దతు సర్పంచ్ అరుణాదేవి ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు వార్డు సభ్యులతో సమావేశమై బహిరంగ విచారణ చేపట్టారు. సర్పంచ్ ఫిర్యాదు చేసిన విషయాలను చదివి వినిపించారు. ఈఓ ఎలాంటి తప్పు చేయలేదని గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్నారని సభ్యులు తీర్మానించారు. కార్యాలయంలో రికార్డులను ఈఓపీఆర్డీ పరిశీలించారు. ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ కృష్ణకుమార్‌పై వచ్చిన ఆరోపణలు అవాస్తమని వార్డు సభ్యులు గౌడప్ప, వరుణ్, జయశీలమ్మ, ఉరుకుందు, శ్రీనివాసులు, రోహిణి అన్నారు. విచారణ అనంతరం వారు మాట్లాడుతూ.. సర్పంచ్ అక్రమాలకు సహకరించడం లేదనే ఈఓపై ఆరోపణలు చేస్తున్నారని వెల్లడించారు.

సీజనల్ హాస్టల్ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీఎస్ఎస్ జీసీడీఓ సునీత

హొళగుంద: స్థానిక కొండ కాలనీలోని కడ్డమాగి పాఠశాల భవనంలో కొనసాగుతున్న సీజనల్ హాస్టల్‌ను జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ జీసీడీఓ సునీత, అసిస్టెంట్ జీసీడీఓ వేదమణి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు వసతి, నాణ్యమైన భోజనం, విద్య అందుతుందా లేదా అని ఆరా తీసారు. కొద్దిసేపు విద్యార్థులతో ముచ్చటించిన అధికారులు నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చి హాస్టల్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట ఉషోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రెసిడెంట్ చిన్నహ్యాట నాగరాజు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ. 2 లక్షలు విరాళం



ఆలయ నిర్వాహకులకు విరాళం అందిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: చిప్పగిరి మండలం నేమకల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో ఎల్లమ్మవ్వ ఆలయ నిర్మాణానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం రూ. 2 లక్షలు విరాళం అందించారు. ఈ మేరకు సోమవారం నగదును ఆలయ నిర్వాహకులకు అందజేశారు. మంత్రి జయరాం మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకారం అందించాలని కోరారు. తిమ్మాపురం, నగరడోణ గ్రామాల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

ఇంటర్వ్యూలు



అభ్యర్థిని ఇంటర్వ్యూ చేస్తున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

నందవరం: మండలంలోని ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కృష్ణమూర్తి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నాగలదిన్నె, హాలహర్వి, గురజాల, నందవరం గ్రామాల్లో ఖాళీగా పోస్టులకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో చేసుకోగా ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. నందవరంలో ఎస్టీ కావడంతో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేదని, పోస్టు ఖాళీగా ఉందన్నారు. ఇంటర్వ్యూలు పకడ్బందీగా నిర్వహించామని తెలిపారు. సీఓ లక్ష్మీనారాయణ, జూనియర్ అసిస్టెంట్ ఈరన్న పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలో ఆయా గ్రామాల్లో ఖాళీగా ఉన్న 7 గ్రామ వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. మండలంలో బైలుప్పల-1, గోనెగండ్ల-2, హెచ్. కైరవాడి-1, పెద్దనేలటూర్ -, కులుమాల-1 చొప్పున వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇంటర్వ్యూలు పకడ్బందీగా నిర్వహించామని అర్హులైన వారిని త్వరలోనే ప్రకటిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

మహిళలకు 'ఆసరా'గా సీఎం జగన్





వెల్దుర్తిలో వైఎస్సార్ ఆసరా మెగా చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, డీఆర్‌డీఏ పీడీ, ఎంపీపీ తదితరులు, హాజరైన పొదుపు మహిళలు

వెల్దుర్తి: మహిళలకు ఆర్థికంగా సాయం అందించడంతోపాటు,రుణ విముక్తుల్ని చేసి ఆసరాగా నిలుస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం స్థానిక మండల కార్యాలయాల ప్రాంగణంలో వైకేపీ ఏపీఎం చంద్రశేఖర్, మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు.ఎమ్మెల్యేతోపాటు డీఆర్‌డీఏ వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం తమదన్నారు. సీఎం జగనన్న పొదుపు మహిళలకు ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నిధులు మంజూరు చేశారన్నారు. డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన సాయంతో మహిళలు తమ జీవనోపాధులు మెరుగుపరుచుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే, పీడీలు వెల్దుర్తి మండలంలో 847 సంఘాలలోని 8,561 మందికి మంజూరైన రూ.4,96,56,000 మెగా చెక్కును ఎంపీపీ బొమ్మన సరళారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, సర్పంచ్ ముత్యాల శైలజతో కలిసి పొదుపు గ్రూపు సభ్యులకు అందించారు. పొదుపు మహిళలు కృతజ్ఞతగా సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. విశేషంగా తరలివచ్చిన మహిళా సభ్యులు సీఎం జగనన్నకు థ్యాంక్స్ అన్న ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీఓ శ్రీనివాసరావ్, ఈఓఆర్డీ నరసింహులు, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు, వైకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కృష్ణగిరి: మండలంలోని సంగాల గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డికి రూ.26 వేలు, ఆగవేలికి చెందిన కురువ ఈశ్వరమ్మకు రూ.55 వేలు, ఎస్‌హెచ్ ఎర్రగుడికి చెందిన దేశాయ్ యుగంధర్‌రెడ్డికి రూ.60 వేలు, పత్తికొండకు చెందిన పాటిల్ రాధకు రూ.37 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరు కాగా ఈ చెక్కులను ఎమ్మెల్యే శ్రీదేవి కర్నూలులోని స్వగృహం వద్ద బాధితులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సీఎం జగనన్న ఆపద్బాంవుడిగా అండగా నిలుస్తున్నారన్నారు. నాయకులు తెలుగు వెంకటేష్, కురువ చిన్న మద్దయ్య ఉన్నారు.

ఎన్‌సీసీ అధికారుల పరిశీలన



డిగ్రీ కళాశాలను పరిశీలిస్తున్న ఎన్‌సీసీ బెటాలియన్ అధికారులతో ప్రిన్సిపాల్

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మహాయోగి లక్ష్మమ్మవ్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటుకు కర్నూలుకు చెందిన ఎన్‌సీసీ 28వ బెటాలియన్ అధికారులు సురేష్, తిప్పయ్య తదితరులు కళాశాలను సోమవారం పరిశీలించారు. 40 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ మంజూరుకు ఆయా అధికారులు కళాశాలలో మౌళిక వసతులు, క్రీడా మైదానం, డిజిటల్ పర్చువల్ ల్యాబ్, జేకేసీ, ఇంగ్లిష్ లాంగ్వేజీ ల్యాబ్‌లు, స్కిల్ హబ్ సెంటర్లను పరిశీలించి వివరాలను ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా, అధ్యాపకుల నుంచి సేకరించారు. ఎన్‌సీసీ కేర్ టేకర్ డాక్టర్ పాల్‌దేవదానం, వైస్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ సుశీలమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముస్లిం పెద్దలతో సమావేశం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలో ముస్లింలు రంజా న్ మాసం, పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని పట్టణ సీఐ మధుసూదన్‌రావు పేర్కొన్నా రు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. మతసామరస్యానికి మారుపేరు ఎమ్మిగనూరు అని, భక్తిశ్రద్ధలతో పండుగ ప్రశాంతంగా జరుపుకోవాల ని సూచించారు. టౌన్ ఎస్ఐ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

30న బండలాగుడు పోటీలు

కృష్ణగిరి: మండల పరిధిలోని టి.గోకులపాడు గ్రామంలో శ్రీరామనవమి పండుగ పురస్కరించుకుని ఈ నెల 30న రాష్ట్రస్థాయి సీనియర్ విభాగం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మల్లయ్య, పూల రాజు, నీలకంఠ తిమ్మరాజు సోమవారం తెలిపారు. పోటీలు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ప్రదీప్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వృషభాల యజమానులు రూ.500లు ఎంట్రీఫీజు చెల్లిచి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 83744 12811, 95732 03814 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ



చిట్యాలలో విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి

కృష్ణగిరి: రైతు సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు డోన్ ట్రాన్స్‌కో డీఈ, ఏడీలు ప్రసాద్‌రెడ్డి, రమణారావుతో కలిసి సోమవారం ఆయన భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటికే నాలుగు సబ్‌స్టేషన్లు ఉన్నా విద్యుత్ అధికలోడును గుర్తించి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి నూతనంగా సబ్‌స్టేషన్ మంజూరు చేయించారన్నారు. సబ్‌స్టేషన్ పూర్తయితే ఈ గ్రామంతోపాటు కోయిలకొండ, పెద్దొడ్డి, ఆలంకొండ, లాల్‌మాన్‌పల్లె తదితర గ్రామాలకు, వ్యవసాయ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. రూ.2 కోట్లతో ఏర్పాటు చేయనున్న సబ్‌స్టేషన్‌ను నాలుగు నెలల్లో పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. కన్‌స్ట్రక్షన్ డీఈ రాజేష్, ఏఈలు మద్దిలేటి, రాజేంద్రప్రసాద్, కాంట్రాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పల్లకీ మహోత్సవం



ఎనిమిది పల్లకీలతో ఊరేగింపుగా వస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామంలో సోమవారం భీమలింగేశ్వరస్వామి దేవర పల్లకీ మహోత్సవం వేడుకగా జరిగింది. ఆదివారం రాత్రి ఏటి నీటి కోసం నందవరం మండలం గురుజాలకు వెళ్లి అక్కడి రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ఏటి నీటితో సోమవారం గ్రామానికి చేరుకున్నారు. ఉత్సవంలో గార్లదిన్నె, చిన్నమ్రవీడు, గొల్లలదొడ్డి, గాజులదిన్నె, పెద్దమ్రవీడు, చిన్నకొత్తిలి, అల్వాల, కులమాల గ్రామాల పల్లకిలతో భక్తులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు స్వామివారి దేవర మహోత్సవాలు జరుగుతాయని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేవుని కృపకు పాత్రులు కాగలరని గ్రామ పెద్దలు కోరారు.

తూము పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

పత్తికొండ రూరల్: స్థానిక షాదిఖానా వెనుకల కడగొమ్ము, తూమును మట్టితో పూడ్చి చదును చేసిన నూర్‌బాషాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రైతులు, వామపక్షాల ఆధ్వర్యంలో నాలుగు స్తంభాల కూడలిలో ఆందోళన చేశారు. నాయకులు రామచంద్రయ్య, తిరుపాల్, రంగారెడ్డి మాట్లాడుతూ.. చెరువుకు ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని ఆక్రమించుకోడానికి కొందరు మట్టితో చదును చేశారన్నారు. దీంతో భారీ వర్షాలు వస్తే పలు కాలనీలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని వాపోయారు. అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి మట్టితో పూడ్చిన కడగొమ్ము, తూమును వెలికితీయాలని కోరారు. అనంతరం ఆర్డీఓ మోహన్‌దాస్‌కు వినతి పత్రం సమర్పించారు.

సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం



పత్తికొండలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వాల్మీకులు

పత్తికొండ రూరల్: వాల్మీకి/బోయ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో ఆమోదించిన తీర్మానాలను కేంద్రానికి పంపుతుండటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పత్తికొండలో వాల్మీకులు సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సోమవారం స్థానిక వాల్మీకి మహర్షి దేవాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని ఉద్దేశించి వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర డైరెక్టర్ సోమశేఖర్, వాల్మీకి దేవాలయం కమిటీ అధ్యక్షుడు శివశంకర్ మాట్లాడుతూ ఏకసభ్య కమిషన్ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక ఆధారంగా తీర్మానం ప్రవేశపెట్టడం సంతోషదాయకమన్నారు. వీఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నరేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకుడు మధు, వాల్మీకి సంఘం నాయకులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.